క్లుప్తంగా

## అథ్లెటిక్స్‌లో ప్రతిభ చాటిన విద్యార్థినులు



మహబూబాబాద్ అర్బన్: ఈనెల 4న జిల్లా కేంద్రంలో ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి కిడ్స్ అథ్లెటిక్స్ ఎంపికల్లో హోలీ వర్డ్ హైస్కూల్‌లో నాల్గో తరగతి చదువుతున్న జి.శరణ్య 300 మీటర్లు బ్రాడ్ జంప్, 50మీటర్ల అథ్లెటిక్స్ పోటీలో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపికైందని పాఠశాల కరస్పాండెంట్ ఎస్తేరు జయశ్రీ, డైరెక్టర్ అనుదీప్ అన్నారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉదయశ్రీ, ఉపాధ్యాయులు వీరన్న, కృష్ణవేణి, ఉష, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ బాలికల పాఠశాలలో చదువుతున్న 7గురు విద్యార్థినులు అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చాటారు. హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పీడీ పద్మావతి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## ఎరుకలకు ప్రాధాన్యమివ్వాలి

తొర్రూరు: ఎరుకల సామాజికవర్గ నేతలకు పదవుల పంపకాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమివ్వాలని ఎరుకల సంఘం మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నడిగడ్డ శైలజ కోరారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో ఎరుకల సంఘం సమావేశం నిర్వహించారు. శైలజ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎరుకల సామాజిక వర్గాన్ని ఆదుకుంటుందనే విశ్వాసం ఉందన్నారు. ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడం గర్వకారణమన్నారు. చైర్మన్‌గా ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూతాటి కుమార్‌కు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మానస, నాగమణి, రమ, తిరుపతి, ఏసు, మహేష్, వీరసోములు, వీరస్వామి పాల్గొన్నారు.

## సీపీఆర్‌పై అవగాహన



నెహ్రూసెంటర్: ప్రతి ఒక్కరూ సీపీఆర్ విధానంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. జీజీహెచ్‌లో ప్రభుత్వ నర్సింగ్ విద్యార్థులకు బేసిక్ లైఫ్ సపోర్టు (బీఎల్‌ఎస్) కార్యక్రమంలో భాగంగా సీపీఆర్ విధానంపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. అత్యవసర సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలుసుకుని వైద్య సహాయం అందించేలా అవగాహన కలిగి ఉండడం మేలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.లీలా, నర్సింగ్ సూపరింటెండెంట్ లక్ష్మీబాయి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ



డోర్నకల్: డెంగీ, మలేరియా నివారణపై డోర్నకల్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మున్సిపాలిటీ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్, రైల్వే స్టేషన్, బ్యాంక్ స్ట్రీట్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, కమిషనర్ నరేష్‌రెడ్డి, మున్సిపల్ మేనేజర్ ఉదయ్, పీహెచ్‌సీ వైద్యాధికారి సాధ్విజ, జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం నర్సింహరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## శిలలపై చిత్రాలు



ఏనుగు తన పిల్లతో..



పులులు..

మరిపెడ: బండరాళ్లపై చిత్రాలు గీసి ఆకట్టుకుంటుంది హైదరాబాద్‌కు చెందిన లావణ్య. ఈమె మరిపెడలోని ఓ రియల్ ఎస్టేట్ వెంచర్‌లో బండరాళ్లపై ఏనుగు, పులి, సీతాకోకచిలుక ఇలా అనేక రకాల చిత్రాలు వేసి ఆకట్టుకున్నారు. ఈ ప్రదర్శనను చూసేందుకు వచ్చిన వారి చిత్రాలు కూడా కేవలం పది నిమిషాల్లో గీసి వారికందించారు.

# గుడుంబా స్థావరాలపై దాడులు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ టౌన్, రూరల్ పోలీసులు పట్టణ, రూరల్ మండల పరిధిలోని గ్రామాలు, తండాల్లో శుక్రవారం గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించి 120 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, 25 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని, ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో టౌన్, రూరల్ సీఐలు దేవేందర్, సర్వయ్య, ఎస్సైలు అరుణ, దీపికరెడ్డి, విజయ్ కుమార్, హెడ్ కానిస్టేబుళ్లు జాకీర్, రాజగోపాల్ రెడ్డి, కానిస్టేబుళ్లు సురేందర్, గౌతం, చంద్రశేఖర్, జ్యోతి, కృపామణి, మోహన్ పాల్గొన్నారు.

కురవి: మండలంలోని తట్టుపల్లి శివారు చంద్యా తండాలో కురవి ఎస్సై బి.గోపి ఆధ్వర్యంలో గుడుంబా స్థావరాలపై శుక్రవారం దాడులు నిర్వహించారు. సీరోలు ఎస్సై విజయ్‌రాం కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని నల్లెల్ల శివారు గాజ తండాలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు.

మరిపెడ రూరల్: గుడుంబా రహిత సమాజం కోసం ప్రతీ ఒక్కరు పాటు పడాలని సీఐ హత్తిరాం నాయక్ అన్నారు. ఎడ్జెర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని పూసలతండాలో శుక్రవారం 2క్వింటాళ్ల నల్లబెల్లం, 10కేజీల పటిక, 20లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. 500 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఇద్దరిపై కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో ఎస్సైలు తహెర్‌బాబా, సంతోష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డోర్నకల్: మండలంలోని ఫకీరాతండా, పూసలతండా, బోడ్యాతండాలలో శుక్రవారం డోర్నకల్ పోలీసులు గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. డోర్నకల్ సీఐ బి.ఉపేందర్‌రావు ఆధ్వర్యంలో మూడు తండాల్లో దాడులు నిర్వహించి రహస్య ప్రదేశాల్లో నిల్వ చేసి బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. దాడుల్లో రెండు లీటర్ల నాటుసారా, 10 కేజీల నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఎస్సై సంతోష్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.



మహబూబాబాద్ రూరల్: బెల్లం పానకం ధ్వంసం చేస్తున్న పోలీసులు



మరిపెడ రూరల్: పూసలతండాలో ప్రజలతో మాట్లాడుతున్న సీఐ హత్తిరాం



డోర్నకల్: ఫకీరాతండాలో..



కురవి: చంద్యాతండాలో..



తొర్రూరు: పెద్దదుబ్బతండాలో..



గంగారం: జంగాలపల్లి గ్రామంలో..

### కేసు నమోదు

గార్ల: మండలంలోని బాలాజీతండాకు చెందిన అజ్మీర రీనా ఇంట్లో అక్రమంగా గుడుంబా విక్రయిస్తుండగా పోలీసులు దాడి చేసి 8 లీటర్ల కాపుసారా, 150 లీటర్ల బెల్లంపానకంను స్వాధీనం చేసుకోగా, ఆమెపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.జీనత్‌కుమార్ శుక్రవారం తెలిపారు.

### నిదానపురంలో ఇద్దరిపై..

దంతాలపల్లి: మండలంలోని నిదానపురంలో గునిగంటి లింగయ్య, వీరబోయిన వెంకటమ్మ ఇళ్లలో పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించి 25 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కరుణాకర్ తెలిపారు.

తొర్రూరు: మండలంలోని భీముడు తండా, పెద్ద దుబ్బతండాలో శుక్రవారం పోలీసులు 30 లీటర్ల నాటుసారా , 500 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జగదీష్ తెలిపారు.

గంగారం: మండలంలోని జంగాలపల్లిలో 150 లీటర్ల బెల్లం పానకం, 35 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని, ముగ్గురుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవి శుక్రవారం తెలిపారు.

## జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలి

బయ్యారం/కొత్తగూడ: సంగారెడ్డిలో నేటి (శనివారం) నుంచి నిర్వహించే పీడీఎస్‌యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేతగాని రాకేష్ అన్నారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పీడీఎస్‌యూ రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. రానున్న కాలంలో విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం మరిన్ని ఉద్యమాలు నిర్వహించేందుకు కౌన్సిల్ ఉపయోగపడనుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు విజయ్, అభిలాష్, వినేష్, పూర్ణేశ్వర్ పాల్గొన్నారు.

## కార్యదర్శిపై చర్య తీసుకోవాలి

గార్ల: పెద్దకిష్టాపురం పంచాయతీలో పీసా చట్టం అధ్యక్ష, కార్యదర్శి ఎన్నిక కోసం నిర్వహించే గ్రామసభను ఇప్పటికి 5సార్లు వాయిదా వేసిన పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అజ్మీర వెంకన్న, గూగులోత్ సాయికుమార్ శుక్రవారం డిమాండ్ చేశారు. గ్రామస్తులు ఎంపీడీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. గ్రామసభలో వాంకుడోత్ సంతోష్, అనిల్, గాంధీ, భావ్‌సింగ్, కిరణ్, రాజారాం, తదితరులు పాల్గొన్నారు. ఇట్టి విషయంపై పంచాయతీ కార్యదర్శి క్రాంతికుమార్‌ను 'సాక్షి' వివరణ కోరగా గ్రామసభలో కోరం సభ్యులు పూర్తిగా హాజరు కానందున పీసా గ్రామసభ వాయిదా వేసినట్లు తెలిపారు.

# బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



మహబూబాబాద్ రూరల్: సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



గార్ల: నగరం గ్రామంలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

మహబూబాబాద్ రూరల్: ఉపాధ్యాయులే పాఠశాల పరిరక్షణకు పునాది రాళ్లని అమనగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కళ్లెం లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని అమనగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీ, పదోన్నతిపై వెళ్లిన హెచ్‌ఎం కళ్లెం వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు దేశబోయిన వెంకన్న, సిద్దోజు. కవిత, బలాస్టి రమేష్, భూక్య బాలాజీ సన్మాన కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గుగులోతు సత్య శంకర్, ఉపాధ్యాయులు డేనియల్, శశిధర్, జనార్దన్, ఫహీమ్ పాల్గొన్నారు.

### ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పది

ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యాప సీతయ్య అన్నారు. ఇటీవల ప్రభుత్వ పాఠశాలలో పదవి వీరమణ పొందిన గూగులోత్ కిషన్ నాయక్‌ను జిల్లా కేంద్రంలోని బీజేపీ నాయకులు శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోసంగి మురళి, నాయకులు కుమార్, ఉపేందర్, వంశీ, రంగన్న పాల్గొన్నారు.

గార్ల: మండలంలోని నగరం ప్రాథమిక పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు రూప్‌సింగ్, అజయ్‌సింగ్‌లను గ్రామపెద్దలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎర్రయ్య, బుచ్చిరాములు, జంపన్న, అబ్బయ్య, సమ్మయ్య, సుశీల, సమ్మక్క, తదితరులు పాల్గొన్నారు.

## పదోన్నతులను కొనసాగించాలి

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో ఇటీవల పదోన్నతులు పొందిన 8మంది ఉపాధ్యాయులకు యథావిధిగా పదోన్నతులను కొనసాగించాలని వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు శుక్రవారం విద్యాశాఖ అధికారి పి.రామారావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్, పీఆర్‌టీయూ, ఎస్సీ ఎస్టీ, టీఎస్‌యూటీఎఫ్, డీటీఎస్, టీటీయూ, ఆర్‌యూపీపీటీఎస్, టీపీఎస్‌యూ ఉపాధ్యాయ సంఘాల నాయకులు శ్రీశైలం, బద్రినారాయణ, మురళీకృష్ణ, భాస్కర్, రామరాయ్య, గోపి, శ్రీనివాస్, ప్రభాకర్ పాల్గొన్నారు.

# కేంద్రంపై సీఎంలు ఒత్తిడి తేవాలి

కేసముద్రం: విభజన హామీలను తక్షణమే అమలు చేసేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఇద్దరు సీఎంలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. మండల కేంద్రంలోని హరిహరగార్డెన్స్‌లో రెండో రోజు శుక్రవారం జరిగిన సీపీఎం జిల్లా స్థాయి శిక్షణ తరగతులకు ఆయన హాజరయ్యాడు. అనంతరం ఆయన మాట్లాడారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ, కాజీపేటలో కోచ్‌ఫ్యాక్టరీ ఏర్పాటు ఏర్పాటు జరిగేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యలపై వేగంగా స్పందించడంలేదని విమర్శించారు. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలిచ్చి మాటను నిలబెట్టుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.నాగయ్య, జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, గుణిగంటి రాజన్న, మార్తనేని పాపారావు, అల్వాల వీరయ్య, తాడబోయిన శ్రీశైలం, మండ రాజన్న, కందునూరు శ్రీనివాస్, కుంట ఉపేందర్, మహేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీరయ్య

# 'ప్రజాసేవతో చిరకాలం నిలుస్తారు'



మహబూబాబాద్ రూరల్: మంగీలాల్‌ను సన్మానిస్తున్న నాయకులు

మహబూబాబాద్ రూరల్: మండలంలోని ఉమ్మడి వేమునూర్ (చెన్నకిష్టాపురం, ఇందిరానగర్ కాలనీ, ఉత్తరతండా, వేమునూర్) ఎంపీటీసీ బానోత్ మంగీలాల్ పదవి విరమణ సందర్భంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉమ్మడి వేమునూర్ గ్రామ పార్టీ అధ్యక్షుడు ఉపేందర్, వెంకన్న, కూన శ్రీనివాస్, రవి, శ్రీను పాల్గొన్నారు.

దంతాలపల్లి: మండలకేంద్రంలోగల జిల్లా ప్రజాపరిషత్ సెకండరీ పాఠశాలలో బదిలీ, పదోన్నతులపై వెళ్తున్న ఉపాధ్యాయులను పాఠశాల ఆవరణలో శుక్రవారం హెచ్‌ఎం వేణుమాధవరెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ శ్రీదేవి, సురేంద్రగుప్తా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మరిపెడ: ప్రజాప్రతినిధిగా ప్రజలు చేసిన సేవలు చిరకాలం నిలుస్తాయని సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్ అన్నారు. ఎల్లంపేట ఎంపీటీసీ తాళ్లపల్లి రఘురాములు పదవి కాలం ముగిసిన సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు భద్రయ్య, రాములు, ఆర్‌ఎంపీ కమలాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ రవి పాల్గొన్నారు.

# అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

మహబూబాబాద్ రూరల్: నిరుద్యోగుల సమస్యలపై ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు చేస్తున్నారని, అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని సేవాలాల్ సేన రాష్ట్ర కోకన్వీనర్ ధరావత్ వెంకన్ననాయక్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సిరికొండ సంపత్ అన్నారు. నిరుద్యోగుల జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు సేవాలాల్ సేన, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు చలో హైదరాబాద్, జిల్లా కలెక్టర్ కార్యాలయ ముట్టడికి బయలుదేరగా శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో సేవాలాల్ సేన జాతీయ నాయకులు ధరవత్ మోతీలాల్ నాయక్, జిల్లా కన్వీనర్ గుగులోత్ నందులాల్ నాయక్, నాయకులు రాంబాబు నాయక్, రామునాయక్, బీజేవైఎం జిల్లా జనరల్ సెక్రెటరీ వీరమల్ల ప్రేమ్‌రాయుడు, పట్టణ అధ్యక్షుడు గువ్వ శ్రీకాంత్, నరేష్, నవీన్, నార్ల రమేష్, రాజేష్, మహేష్, నరేష్ ఉన్నారు.



నాయకుల అరెస్టును చూపిస్తున్న సీఐ దేవేందర్

# ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య



విద్యార్థినులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ సదానందం, తదితరులు

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో చేర్పించాలని కళాశాల ప్రిన్సిపాల్ పాక్కుల సదానందం అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో శుక్రవారం విద్యార్థినులకు ఉచిత పుస్తకాలను ప్రిన్సిపాల్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏడాది ఈ కళాశాల నుంచి విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధిస్తున్నారన్నారు.

## సంక్షిప్త సమాచారం

### కొత్త చట్టాలపై అవగాహన

కేసముద్రం: అమ్మాయిలను వేధిస్తే కొత్త చట్టాల ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని షీటీం సునంద అన్నారు. శుక్రవారం మండలంలోని కల్వల గ్రామంలోని మోడల్‌స్కూల్, జెడ్పీ హైస్కూల్‌లో కొత్త చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శాంతికిరణ్, హెచ్‌ఎం బండారు నరేందర్, సఖీ లీగల్ అడ్వైజర్ ఉషా పాల్గొన్నారు.

### నీరు సురక్షితంగా ఉండాలి

దంతాలపల్లి: గ్రామాలలో సరాఫరా చేస్తున్న నీరు సురక్షితంగా ఉండాలని ఎంపీడీఓ వివేక్‌రామ్ అన్నారు. మండలంలోని బొడ్లాడ గ్రామంలో నీటి సరాఫరాను శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యురాలు స్వాతి, ఆశలు, కారోబార్ సురేష్, సిబంది పాల్గొన్నారు.

### మిషన్ భగీరథ పైపు లీకేజీ



మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని బేతోలు గ్రామంలో శుక్రవారం మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ అయ్యింది. నీరు వృథా కావడంతోపాటు పలు ఇళ్లలోకి నీరు చేరి ధాన్యం బస్తాలు తడిసి ముద్దయ్యాయి. మరమ్మతులు చేయనున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

### పోడు రైతులకు 'రైతు భరోసా' ఇవ్వాలి

గూడూరు: పోడు రైతులకు పట్టాలతోపాటు రైతు భరోసా అందించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమాక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య అన్నారు. మండలంలోని మచ్చర్లలో శుక్రవారం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కొట్టెం అచ్చన్న, గజ్జి లింగన్న, అద్దూరి వెంకన్న, కాడబోయిన నర్సయ్య పాల్గొన్నారు.

### పరిశుభ్రతే ఆరోగ్యానికి రక్ష

గూడూరు: మండలంలోని మట్టెవాడ గ్రామంలోని గిరిజన బాలుర ఆశ్రమంలో శుక్రవారం ఆయోధ్యపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ యమున, డాక్టర్ నరేష్, హెచ్‌డబ్ల్యూఓ సురేందర్, పీహెచ్‌ఎన్.కోమల, లోక్యానాయక్, గణేశ్ పాల్గొన్నారు.

### విద్యార్థులకు వైద్య పరీక్షలు

పెద్దవంగర: మండల కేంద్రంలోని ఎక్స్‌రోడ్డు వద్ద ఉన్న ప్రాథమిక పాఠశాల్లోని విద్యార్థులకు శుక్రవారం ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యనారాయణ, వైద్యాధికారులు రేణుక, నిర్మల, ఉపాధ్యాయులు రవికుమార్, రంజిత్ పాల్గొన్నారు.

### పారిశుద్ధ్య సమస్యలపై ప్రత్యేక దృష్టి

డోర్నకల్: మున్సిపాలిటీ పరిధిలోని వార్డులన్నింటిలో పారిశుద్ధ్య సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ నరేష్‌రెడ్డి తెలిపారు. పలువార్డుల్లో శుక్రవారం జరుగుతున్న పారిశుద్ధ్య పనులను మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్నతో కలిసి కమిషనర్ పరిశీలించారు.

### పోలీసుల అదుపులో నాయకులు

డోర్నకల్: బీజేవైఎం ఆధ్వర్యంలో చేపట్టిన చలో టీజీపీఎస్‌సీ నేపథ్యంలో శుక్రవారం పలువురు బీజేపీ నాయకులను డోర్నకల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు గణేష్‌నాయక్, పట్టణ అధ్యక్షుడు దేవానాయక్, నాయకులు రెహమాన్, వ్యాస్ లక్ష్మీనారాయణ, గఫూర్, బస్సబోయిన ఉపేందర్‌ను అదుపులోకి తీసుకుని బైండోవర్ చేశారు.

### బ్యాగుల పంపిణీ



కేసముద్రం: మండలంలోని తాళ్లపూసపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో, అంగన్‌వాడీ కేంద్రంలో రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర సభ్యుడు రావుల రవిచందర్‌రెడ్డి తన పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు, బ్యాగులు, పలకలు, బెంచీలను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు యాళ్ల మురళీధర్‌రెడ్డి, కార్యదర్శి చాడ అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### దాతలు ముందుకు రావాలి

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ పాఠశాల్లో పేద విద్యార్థుల చదువు కోసం దాతలు ముందుకు రావాలని ఈదులపూసపల్లి ప్రభుత్వ పాఠశాల కాంప్లెక్స్ హెచ్‌ఎం వీరయ్య అన్నారు. మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని ఈదులపూసపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ఉపాధ్యాయుడు సోమ రవి మిత్రుడు సాఫ్ట్‌వేర్ ధీరజ్ రూ. 6వేల ఆర్థికసాయం అందజేశారు. హెచ్‌ఎం శివలక్ష్మి, సీఆర్‌పీ వీరన్న పాల్గొన్నారు.

### సామగ్రి పంపిణీ

తొర్రూరు: మండలంలోని గుర్తూరు ఉన్నత పాఠశాలకు చైత్రశ్రీ ఫౌండేషన్ సహకారంతో శుక్రవారం రూ.50వేల విలువ చేసే విద్యా సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మిరియాల సతీష్‌రెడ్డి, సంస్థ ఫౌండర్ మార్గం రమాదేవి, ప్రతినిధులు వినూత్న, చంద్రశేఖర్, భాగ్యలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

### ఎత్తిపోతల పథకం పరిశీలన

కురవి: మండలంలోని రాజోలు శివారు స్టేషన్‌గుండ్రాతిమడుగు గ్రామంలోని ఎత్తిపోతల పథకాన్ని శుక్రవారం ఇరిగేషన్ అధికారులు సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈ నరేష్, రైతులు తునగర్ కృష్ణ, నాగేశ్, సూర్య నాయక్, మాలోత్ చందు, బానోత్ వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతున్న మహిళ మృతి

నర్సింహులపేట: మండలంలోని బొజ్జన్నపేట గ్రామానికి చెందిన కందుకూరి ప్రవంతి(34) చికిత్స పొందుతూ శుక్రవారం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో మృతి చెందింది. ఎస్సై గండ్రాతి సతీష్ కథనం ప్రకారం.. ప్రవంతి గత నెల 4న తన కిరాణంలో పెట్రోలు బాటిల్ తీస్తుండగా బాటిల్ ఎలక్ట్రిక్ స్విచ్ బోర్డుపై పడింది. దీంతో షాపులో మంటలు వ్యాపించాయి. మంటల్లో ప్రవంతికి తీవ్రగాయాలయ్యాయి. హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి కూతురు, కుమారుడు ఉన్నారు. భర్త రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### 9న సీత్లా భవాని పండుగను జరుపుకోవాలి

మరిపెడ రూరల్: బంజార గిరిజనులు ఎంతో పవిత్రంగా జరుపుకునే సీత్లా పండుగను వేర్వేరు తేదీల్లో కాకుండా ఈనెల 9న ఒకే రోజు జరుపుకొని జాతీ ఐక్యతను చాటుకుందామని లంబాడీల ఐక్య వేదిక (లైఫ్) మండల కోఆర్డినేటర్ గుగులోతు దేవేందర్ శుక్రవారం తెలిపారు.


### మొక్కలు నాటిన యూత్ నాయకులు

పెద్దవంగర: జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంతో పాటు ఉప్పరగూడెం గ్రామంలో ముద్రబోయిన రాము ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కట్టోజు భాస్కరాచారి, మెరుగు సందీప్, కిరణ్, అజయ్, దుంపల రాజు పాల్గొన్నారు.

## పోరాటానికి సన్నద్ధం కావాలి

నెహ్రూసెంటర్: ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సన్నద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నవీన్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా విజయసారథి మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సీపీఐ శ్రేణులు సిద్ధంగా ఉండాలన్నారు. ఈనెల 18వ తేదీన సీపీఐ జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశం కురవి మండల కేంద్రంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శులు బి.అజయ్‌సారథిరెడ్డి, నల్లు సుధాకర్‌రెడ్డి, వరిపెల్లి వెంకన్న, చింతకుంట్ల వెంకన్న, సాంబలక్ష్మీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అక్రమంగా రాయితీ ఎరువుల తరలింపు



కేసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రాయితీ కింద అందించే ఎరువుల బస్తాలను ఓ సొసైటీకి చెందిన గోదాం నుంచి అక్రమంగా ప్రైవేట్ ఎరువుల దుకాణానికి తరలించిన సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని కాట్రపల్లి ఉమ్మడి గ్రామానికి చెందిన ఓ రైతు యూరియా బస్తాల కోసం మండల కేంద్రంలోని ధన్నసరి పీఏసీఎస్ గోదాం వద్దకు వచ్చాడు. తనకు యూరియా బస్తాలు కావాలని అడుగగా, దుక్కిమందు తీసుకుంటేనే యూరియా బస్తాలు ఇస్తామంటూ గోదాం ఇన్‌చార్జ్ చెప్పాడు. అదే సమయంలో ఓ ట్రాలీ ఆటోలో సొసైటీకి చెందిన గోదాం నుంచి సుమారు 50 బస్తాలకు పైగా యూరియా బస్తాలను ఓ ప్రైవేట్ ఎరువుల దుకాణానికి తరలిస్తుండగా, గమనించిన అక్కడున్న రైతు సెల్‌ఫోన్‌లో వీడియో తీశాడు. ఆ తర్వాత గోదాం ఇన్‌చార్జ్‌ను నిలదీయగా బయట ఓ ప్రైవేట్ ఎరువుల దుకాణాదారుడికి అమ్మినట్లు తెలిపాడు. కాగా ట్రాలీ ఆటోలో ఎరువుల బస్తాల తరలింపు వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.